# ఇది నిజమా?

రచన :

శ్రీ రేగులపాటి కిషన్ రావు.

(గత సంచిక తరువాయి)

"ఎవరో అనడం కాదు. జానకి ఉత్తరం వ్రాసింది"

జానకి ఉత్తరమంటే అన్నయ్య ఆసక్తి చూపిస్తాడని తెలుసు.

"ఆ ఉత్తరం నేను చదువొచ్చా?" అన్నాడు ఎప్పటిలాగే.

సంవత్సరం క్రితం జానకి వ్రాసిన ఉత్తరాన్ని అమ్మకు చదివి వినిపిస్తుండగా అన్నయ్యకూడా అన్నం తింటూ విన్నాడు. "ఉత్తరాలు వ్రాయడమంటే ఇలా వ్రాయాలి. నీ ఫ్రెండుకు నా అభినందనలు చెప్పు" అన్నాడు. ఆనాటి నుండి జానకి వద్దనుండి ఉత్తరం వచ్చిందని చెప్పగానే అన్నయ్య ఆసక్తి కనబరుస్తున్నాడు. చాలా మర్యాద ఉట్టిపడే కంఠస్వరంతో "ఆ ఉత్తరం నేను చదువొచ్చా?" అంటుంటాడు. అన్నయ్య సాహిత్యాభిమాని. కవితలు పత్రికల్లో వస్తుంటాయి. సినిమాలకు పాటలు వ్రాసే ఛాన్సుకోసం ప్రయత్నిస్తున్నాడు. ఆ రంగానికి చెందిన వ్యక్తులను కలుసుకోవడం కోసం అప్పుడప్పుడు వెళ్తుంటాడు. అన్నయ్యకొన్న పుస్తకాల సంఖ్య ఎంత వుందో తెలియదు గానీ బీరువానిండా వున్నాయి. అంతేకాదు. టేబిల్ మీద, దూలాల మీద, పడకగదిలో ఇంకా నమ్మకమైన ఫ్రెండ్స్ దగ్గర...

ఉత్తరం అన్నయ్యచేతికందవ్వకుండా చదివి వినిపించాను.

"రాను, నాకు వేరేపనుంది" అన్నాడు సినిమా కవిలా ఫోజుపెట్టి.

"నా సంతోషం కన్నా నీపనే నీకు గొప్పఅన్న మాట" అన్నాను కోపం అభినయిస్తూ.

"అలా అంటే ఎలాగే మంజూ!"

"లేకపోతే ఎలా అనాలి? మనవూరికి రోడ్డు వేయించమని అడగనా? బస్సువేయించమని అడగనా? బస్సు సౌకర్యం లేకపోవడం వల్లనేగా నిన్ను అడిగేది. మహా వుందయ్యా మా అన్నయ్యకే ఓ సైకిల్ మోటారు..."

"మంజూ! అలా వెక్కిరించ వద్దన్నానా?"

"నేను చెప్పినట్టు వింటే నువ్వు వద్దన్నది నేను చేస్తానా?"

అన్నయ్య కాస్త ఆలోచించి "సరే నేను కూడా నీతో వేములవాడకు వస్తాను" అన్నాడు.

* * *

"మంజూ! నారాయణరెడ్డిగారు హస్మాజిపేటకు వచ్చారని తెలిసింది. నేను వారిని కలుసుకోవడానికి వెళ్తున్నాను. నువ్వు ఇక్కడే వుంటావో జానకి ఇంటికి వెళ్తావో అది నీయిష్టం" అన్నాడు.

అన్నయ్య, నేను సైకిల్ మోటారుపై నిన్ననే ఇక్కడికి వచ్చాం. ఈ వూరికి రాగానే నేను జానకి ఇంటికే వెళ్దామన్నాను. అన్నయ్య ఒప్పుకోలేదు. "మన బావ ఈ వూళ్ళో వుండగా మనం ఫ్రెండ్ ఇంటికి వెళ్ళడం ఏం బాగుంటుంది" అన్నాడు. అన్నయ్య మాట ప్రకారం బావ వుంటున్న ఈ అద్దె ఇంటికే వచ్చేశాం. రాత్రి సుమతీ కౌశల్ డ్యాన్స్ ప్రోగ్రాం చూశాం. అన్నయ్య జానకితో చాలా ఉత్సాహంగా మాట్లాడాడు.

"రేపు నువ్వు మీ అన్నయ్య మా యింటికి భోజనానికి రావాలి. నేను ఉదయమే మీ వద్దకు వస్తాను" అంది జానకి డ్యాన్స్ ప్రోగ్రాం తర్వాత విడిపోయే ముందు.

"అమ్మా! మీరేమీ అనుకోవద్దు గానీ రేపటికోసం ఏర్పాట్లన్నీ నేను చేశాను. మీ యింట్లో ఎల్లుండి..." బావ పెద్ద మనిషిలా అన్నాడు.

బావ బి.కాం. పాసయ్యాక ఉద్యోగం దొరకక, వ్యవసాయం చేయడానికి ఇష్టపడక ఈ వూళ్ళో బట్టల వ్యాపారం ప్రారంభించి వృద్ధిలోకి వచ్చాడు. వ్యాపారంలో ఈ రెండు సంవత్సరాల్లోనే బాగా అనుభవం సంపాదించాడు. బావ నాలాగా అమాయకుడు కాదు. లౌక్యం తెలిసినవాడు. మాటనేర్పరితనం వున్నవాడు. ఈ బావతోనే నా పెళ్ళి నిశ్చయమైంది.

అన్నయ్య నామాట వినిపించుకోకుండా సైకిల్ మోటారు బయటకు తీసి స్టార్ట్ చేసి పరుగుతీశాడు-పరుగు పరుగు ఒకే పరుగు హస్మాజిపేట వూరికి పరుగు.

నేను వీధి తలుపులు వేసి పడకగదిలోకి పరుగు

తీశాను. బావ వుంటున్న ఈ యింట్లో రెండు గదులు, వెనుక వంటశాల వుంది.

బావ అభిరుచులు, అలవాట్లు తెలుసుకోవడం కోసం అతని గది పరిశోధించాలని ఉదయం నుండి అనుకుంటున్నాను. ఏకాంతం కోసం చూస్తున్నాను. ఇప్పుడా అవకాశం దొరికింది.

అల్మారీ తలుపులు తెరిచాను. నాలుగు అరలున్నాయి. పై అరలో పుస్తకాలున్నాయి. తీసి చూశాను. అందులో చాలావరకు వ్యాపార సంబంధమైన పుస్తకాలే! నవలలు, కథల పుస్తకాలు కొన్నిమాత్రమే వున్నాయి. ఆ పుస్తకాలు తీసి చూస్తుండగా ఓ కాగితం క్రింద పడింది. దానిని వంగి తీస్తుండగా వీధి తలుపులు తడుతూ "మంజూ!" అంటూ బావ పిలుపు వినిపించింది. ఆ కాగితం విప్పి చూశాను. అది విలాసాగర్ నుండి వ్రాయబడిన ఉత్తరం. "రవిగారికి..." "మంజూ!" బావ బిగ్గరగా పిలిచాడు. నేను ఉత్తరం మడువబోతూ దాని క్రిందివైపు చూశాను. "సులోచన" అని వుంది.

బావకు ఒక స్త్రీ ఉత్తరం వ్రాసిన ఈ విషయం నిజమేనా? అని ఆశ్చర్య పోయాను. బావకు ఆడ స్నేహితులున్నారా? లేక వ్యాపార సంబంధమైన ఉత్తరమా? చదవడానికి వ్యవధిలేదు. ఉత్తరం మలిచి జాకెట్లో పెట్టుకోబోయి దానికా అర్హత వుందోలేదో తేల్చుకోలేక చివరికి "ఎంత సాహసం?" అనే పుస్తకములో పెట్టేసి గబగబా అల్మారీ మూసేసి వెళ్ళి వీధి తలుపులు తీశాను.

* * *

జానకి యింటికి బయలుదేరాను. ఒకచోట చాలామంది గుమిగూడి వున్నారు. అదేమిటో చూద్దామని ఆసక్తిగా అటువైపు వెళ్ళాను.

కాషాయ వస్త్రాలులు ధరించిన ఒక సన్యాసి ఈత చాపమీద కూర్చుని వున్నాడు. అతని ముందు కట్టెపెట్టె వుంది. దాని మీద నల్లటి బట్ట పరచబడి వుంది. నల్లటి బట్ట పైభాగమున పెట్టెమూతను కలుపుతూ రెండు బొమ్మలు అమర్చబడి వున్నాయి. అవి రెండు పోట్లాడుతున్నాయి. "కాళీ...కాళీ...మహాంకాళీ ఓం ఫట్." అంటూ పెట్టెపైన కొట్టాడు సన్యాసి. బొమ్మలు పోట్లాట మానుకున్నాయి. ప్రజలు ఆశ్చర్యపోతూ చూస్తున్నారు.

"జనం ఎక్కువగా గుమిగూడిన చోట దొంగతనాలు జరుగుతుంటాయి. మనం జాగ్రత్తగా వుండాలి" పోలీసు డిపార్టుమెంటులో పనిచేస్తున్న మామయ్య మాటలు జ్ఞప్తికి వచ్చాయి.

నేను పరిసరాలను గమనిస్తున్నాను.

ఆ సన్యాసి మళ్ళీ ఏదో మంత్రం చదివి పెట్టెపై కొట్టాడు. బొమ్మలు మళ్ళీ పోట్లాడసాగాయి.

సన్యాసి శిష్యుడొకడు అగరువత్తులు వెలిగించి పెట్టె దగ్గర పెట్టి ప్రజల వైపు తిరిగి ఇలా అన్నాడు. "మహాజనులారా! మంత్రశక్తితో ఈ ప్రపంచములో దేనినైనా సాధించవచ్చు. భవిష్యత్తును తెలుసుకోవచ్చు. రోగాలను నయం చేయవచ్చు..."

నా మెడచుట్టు కప్పుకొన్న కొంగుపై ఎవరిదో చేయి పడడంతో వెనుదిరిగి చూశాను. వాడెవడో కానీ మెరుపులా కనిపించి మాయమైనట్లే వెళ్ళిపోయాడు.

"...మా గురువుగారి మంత్ర బలంతో బొమ్మలు యుద్ధం చేస్తుండగా చూస్తున్నారు కదా!..."

"నా గొలుసు...నా గొలుసు..." అంటూ ఓ ముత్తైదువ ఏడ్పు ప్రారంభించింది.

"ఆఁ! ఏమయింది నీ గొలుసుకు" అని ఇంకో ముస


కథాంజలి

[చక్కని కథల మాస పత్రిక]

స్థాపితం 1938.

విడి ప్రతి ... 50 పైసలు

సంవత్సర చందా ... రూ. 9-00

(రెండు ప్రత్యేక సంచికలతో సహా)

నేడే చందాదారలుగా చేరండి.

అన్ని హిగ్గిన్‌బాథమ్సు బుక్‌స్టాల్సులో దొరుకును.

♦ కథాంజలి ♦

నెం. 10, మురుగేశ మొదలి వీధి,

మదరాసు - 600 001.

అమ్మ అడగడంతో పోయింది. ఎవడో కొట్టేశాడు, ఎవడో కాజేశాడు వాని చేతులు విరుగ..." అంటూ ముత్తైదువ ఏడుస్తూ చుట్టుపక్కల వాళ్ళవైపు అనుమానంగా చూస్తూ చెప్పింది.

నా మెడలోవున్న బంగారుగొలుసును ఎవడైనా అలాగే కాజేస్తాడేమోనని భయపడి అక్కడి నుండి బయటపడ్డాను. జానకి ఇంటి వద్దకు వచ్చాను. ఇంటికి తాళంవేసి వుంది. ఆ ఇంటి ఇరుగమ్మను అడిగితే తెలిసింది. జానకి అమ్మమ్మ హఠాత్తుగా చనిపోయిందట. ఈ వార్త తెలిసిన వెంటనే ఇంటికి తాళం వేసి అందరూ సుల్తానా బాద్ కు వెళ్ళిపోయారట.

* * *

రాత్రి 9 గంటలకు బావ ఇంటికి వచ్చాడు. ఇద్దరం భోజనం చేశాం.

ఈరోజు అమ్మిన బట్టలు...వాటి విలువలు, కొందరు కొనుగోలు దార్ల మన స్తత్వం...ఇంకా ఈ రోజు వచ్చిన సేల్ టాక్స్ ఆఫీసర్ ను లొంగదీసుకున్న వైనం వర్ణించి చెప్తున్నాడు బావ. అతడు ఏదన్నా చెప్పడం ప్రారంభిస్తే ఎదుటివాళ్ళు ప్రశ్నించడానికి కూడా అవకాశమివ్వకుండా మాట్లాడేస్తాడు.

బావ చెప్పడం ఆపి మౌనంగా కూర్చున్న నన్ను చూచి నవ్వుతూ అన్నాడు. "మరదలుగారికి మూగతనం వచ్చిందా?"

నేను నవ్వి హఠాత్తుగా అడిగాను" నువ్వు మంత్రాలను నమ్ముతావా బావా?"

"నమ్మమంటావా? వద్దంటావా?" ఎదురు ప్రశ్న వేశాడు బావ నవ్వుతూ.

"నేను నమ్మమంటే నమ్ముతావా?"

"నా ముద్దుల మరదలు నమ్మమంటే నమ్మకుండా వుండగలనా?"

"నమ్మవద్దంటే..."

"నమ్మకుండా వుండిపోతాను"

"నేను చెప్పినట్టు వినడానికి నువ్వేమీ గంగిరెద్దువా బావా?"

"నువ్వు అందమైన ఆవువైతే నేను గంగిరెద్దునే అవుతాను మరదలా!"

"ఛీ! పో నీతో మాట్లాడను"

"పోనీ పోట్లాడుతావా?"

"నేనడిగిందేమిటి? నువ్వు మాట్లాడేదేమిటి?"

"నువ్వు అడిగిన ప్రశ్నకే సమాధానం చెప్తాను విను. మంత్రబలం నీలాంటి అందమైన అమ్మాయిల ముఖంలోనే వుంటుందంటే నమ్ముతాను. కానీ మరే విధంగానూ నమ్మను."

"ఈరోజు బజార్లో ఓ సన్యాసి మంత్రబలంతో బొమ్మలను ఆడించాడు తెలుసా!" అన్నాను.

బావ నేను చెప్పింది నమ్మకపోగా నా జడ పట్టుకొని దగ్గరకు లాక్కొని అన్నాడు," పిచ్చి మరదలా! నీకు తలకాయవుందా?"

"బావా! నువ్వు గుడ్డివాడివా?" అన్నాను ఒళ్ళు మండి.

"నేను ఇంతో అంతో సైన్సు చదివిన వాడినైతిని, మంత్రాలను ఎలా నమ్మమంటావు మంజూ!"

"సైన్సు చదవనివాళ్ళు మంత్రాలను నమ్మవచ్చా బావా? ఆ మాటకొంస్తే నేను కూడా ఇంతో అంతో సైన్సు చదివినదానినేగా. మరి నేను స్వయంగా మంత్రబలంతో బొమ్మలు ఆడగా చూశాను" అంటూ చూచినదంతా వర్ణించి చెప్పాను.

బావ గొప్ప వ్యాపారవేత్తలా నవ్వి నా చేయి పట్టుకొని దగ్గరకు లాక్కొని నా కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు "మరదరా! నన్ను ఫూల్ ను చెయ్యకు. అగర్షణ అనేదే మంత్రబలం అయితే అది నిజంగా నీకళ్ళల్లోనే వుంది."

"మైడియర్ బిజినెస్ మ్యాన్ నా కళ్ళను ముక్కును వర్ణించి నా మెడలో తాళికట్టకముందే నాతో లాభం పొందాలనుకోకు. చేయివదులు. వెళ్ళికళ్ళు మూసుకొని పడుకో"

"నువ్వు చెప్పినట్టు కళ్ళు మూసుకొని పడుకుంటాను. మరి నా కలలోకి వస్తావా?"

"కలలుగనే వాళ్ళన్నా, కల్లలాడేవాళ్ళన్నా నాకు మంచి అభిప్రాయంలేదు"

(సశేషం)

Edited and Published by A. N. Raghavachar, No. 10, Murugesa Mudali Street, Madras-600001.
Printed by G. Kulasekaram at Giridhar Art Printers, 47 & 49, Badrian Street, Madras-60 0001.